మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 124 | గురువారం | 23 - 10 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## కిసాన్ సీడ్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి



3లో..



### భారత్-అమెరికా వాణిజ్య

# ఒప్పందం

**- రష్యా చమురు దిగుమతులపై ప్రభావం?**

మన గళం, న్యూఢిల్లీ : భారత్, అమెరికా మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక వాణిజ్య ఒప్పందంపై చర్చలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందం త్వరలో ఖరారయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే భారతీయ ఉత్పత్తులపై అమెరికా ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను 50 శాతం నుంచి 15-16 శాతానికి

2 లో..

### గల్ఫ్ ప్రవాసులకు అండగా

# 'ప్రవాసాంధ్ర భరోసా'



**- దుబాయ్‌లో సీఎం చంద్రబాబు**
**- యూఏఈకి చేరుకున్న ముఖ్యమంత్రి**

మన గళం డెస్క్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన యూఏఈ పర్యటన నిమిత్తం బుధవారం దుబాయ్ చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. స్థానిక భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ నగర టీడీపీ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్రులు, మహిళలు తరలివచ్చి ముఖ్యమంత్రిని

2 లో..

### వివేకా కేసులో..

# మరో మలుపు

**- జైల్లో దస్తగిరి బెదిరింపుపై బీటెక్ రవి సంచలన వాంగ్మూలం**
**- బెదిరింపు ఘటనను ప్రత్యక్షంగా చూసిన బీటెక్ రవి**



మన గళం, కడప/కర్నూలు: అక్టోబర్ 22, 2025 : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని... ఈ కేసు నిందితుల్లో ఒకరైన శివ శంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైలులోనే బెదిరించారని, ఈ ఘటనను తాను ప్రత్యక్షంగా చూశానని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ బెదిరింపుల కేసుకు సంబంధించి ఆయన తన వాంగ్మూలాన్ని పోలీసులకు అందజేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఈరోజు కడప జైలును సందర్శించారు. దస్తగిరిని బెదిరించిన సమయంలో వేరే కేసులో బీటెక్ రవి కూడా అదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉండటంతో, ఆయనను సాక్షిగా ఎస్పీ విచారించి వాంగ్మూలాన్ని నమోదు

2 లో..

### బొద్దింకను చంపబోయి

# అగ్ని ప్రమాదం

**- దట్టమైన పొగతో మహిళ మృతి**



మన గళం డెస్క్ : దక్షిణ కొరియాలోని ఒసాన్ నగరంలో ఓ విచిత్రమైన, విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇంట్లో బొద్దింకల బెడదను తట్టుకోలేక ఓ మహిళ చేసిన పొరపాటు కారణంగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బొద్దింకను చంపేందుకు ఆమె ఉపయోగించిన పద్ధతి కారణంగా ఇంట్లో మంటలు వేగంగా వ్యాపించి, దట్టమైన పొగ అలుముకుంది. ఈ దట్టమైన పొగ పక్క ఫ్లాట్‌కు వ్యాపించడంతో ఊపిరి ఆడక ఒక మహిళ దురదృష్టవశాత్తూ మరణించారు. ఈ సంఘటన ఒసాన్

2 లో..

# అధికారయంత్రాంగం అప్రమత్తం కావాలి


**- వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకూడదు**
**- ముందస్తు చర్యలు చేపట్టండి**
**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : వాయుగుండం నేపథ్యంలో జిల్లాలో అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాలను పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా, తగిన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వాగులు, వంకల వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న చోట వాహన రాకపోకలు నిలిపివేసి, ప్రజలను సురక్షితమైన ప్రత్యామ్నాయ రహదారులపైకి మళ్లించాలని తెలిపారు. విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూడాలని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం అయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు రైతులకు పంట నష్టం జరుగకుండా తగిన సలహాలు అందచేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో, ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రజలను తరలించేందుకు షెల్టర్ లను గుర్తించి, ఆహార పదార్థాలు అందించే విధంగా సిద్ధపడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# అయ్యప్ప సేవలో ద్రౌపది ముర్ము

**- శబరిమలను దర్శించుకున్న తొలి రాష్ట్రపతి**
**- ఇరుముడితో శబరిమల దర్శనం**
**- తప్పిన పెను ప్రమాదం**



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కేరళ పర్యటనలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఇరుముడి ధరించి స్వామి వారి సన్నిధికి చేరుకున్న ఆమె ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె ఆరు కాన్వాయ్‌లతో శబరిమలకు చేరుకున్నారు. సాధారణంగా భక్తులు కాలినడకన మాత్రమే శబరిమల ఆలయాన్ని చేరుకోవాల్సి ఉంటుంది. అయితే, దేశ ప్రథమ పౌరురాలు కావడంతో అధికారులు

2 లో..

# ఆర్థిక హక్కులను వినియోగించుకోండి

**-"మీ డబ్బు - మీ హక్కు" పోస్టర్ ను ఆవిష్కరించిన నంద్యాల జిల్లా కలెక్టర్**




మనగళం, నంద్యాల టౌన్ : బ్యాంకులు కల్పిస్తున్న ఆర్థిక హక్కులను లబ్ధిదారులు వినియోగించుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్ లో "మీ డబ్బు - మీ హక్కు" అనే గోడ పత్రికను యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి. నరసింహారావు, ఎల్డీఎం రవీంద్ర కుమార్, యూనియన్ బ్యాంక్ నూనెపల్లే బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున, డీఈఓతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "మీ డబ్బు %-% మీ హక్కు" అనే నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలలపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని, మరచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం బ్యాంకులు కల్పిస్తున్నాయని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ

2 లో..

### ఏపీకి వాయుగుండం

# ముప్పు



**- అతి భారీ వర్షాల నేపథ్యంలో హోంమంత్రి అనిత కీలక హెచ్చరిక**

మన గళం, విజయవాడ: అక్టోబర్ 22, 2025 : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రానున్న 12 గంటల్లో వాయుగుండంగా బలపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు కదులుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, వాయుగుండం ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీచే

2 లో..

### శ్రీలంకలో పట్టపగలే

# ప్రతిపక్ష నేత దారుణ హత్య



మన గళం డెస్క్ : పొరుగు దేశం శ్రీలంకలో పట్టపగలే ఘోరం జరిగింది. ప్రతిపక్ష సమగి జన బలవేగయ పార్టీకి చెందిన కీలక రాజకీయ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. వెలిగమ నగర కౌన్సిల్ చైర్మన్ లసంత విక్రమశేఖర (38) బుధవారం తన కార్యాలయంలో ప్రజలతో సమావేశమైన సమయంలో ఈ హత్య

2 లో..

### పిడుగుపాటుకు ఇద్దరు

# వ్యవసాయ మహిళా కూలీలు మృతి



మన గళం, గుంటూరు/అమరావతి: అక్టోబర్ 22, 2025 : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతంలో బుధవారం పిడుగుపాటు కారణంగా ఇద్దరు వ్యవసాయ మహిళా కూలీలు దుర్మరణం పాలయ్యారు. టకంపాడురోడ్డు వద్ద వరి పొలంలో పనిచేస్తున్న వలపర్ల మరియమ్మ (45) మరియు షేక్ ముజాహిద (45) అనే ఇద్దరు మహిళలపై

2 లో..

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని 'మింట్' పత్రిక తన కథనంలో పేర్కొంది. అయితే, ఈ వాణిజ్య ఒప్పందంలో ఇంధనం, వ్యవసాయ రంగాలే అత్యంత కీలకమైన అంశాలుగా ఉన్నాయి. ఇందులో భాగంగా భారత్.. రష్యా నుంచి ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న ముడి చమురు (క్రూడ్ ఆయిల్) పరిమాణాన్ని క్రమంగా తగ్గించుకోవాల్సి ఉంటుందని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో మంగళవారం ఫోన్‌లో చర్చలు జరిపారు. ఈ సంభాషణలో ప్రధానంగా వాణిజ్యం, ఇంధన అంశాలపై చర్చించినట్లు అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. అంతేకాక, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ తెలిపారు. మరోవైపు, ప్రధాని మోదీ కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు ధ్రువీకరించారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే, చర్చించిన అంశాల వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ సందర్భంగా, ఉగ్రవాదంపై పోరాటంలో రెండు దేశాలు కలిసి పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా, అమెరికా నుంచి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులకు భారత్ అనుమతించే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే, సుంకాలు, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఈ ఒప్పందం కింద ఏర్పాటు చేయవచ్చని సమాచారం. ప్రస్తుతం వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నందున, ఈ నెలలో జరగనున్న ఆసియాన్ సదస్సులోనే ఈ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తుది ప్రకటన వెలువడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ కీలక పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కానీ, అమెరికా వైట్ హౌస్ కానీ వెంటనే స్పందించలేదు. రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకోవాల్సిన అంశం ఈ ఒప్పందంలో భాగమైతే, అది భారతదేశ ఇంధన విధానంపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. మొత్తంమీద, భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలలో ఈ ఒప్పందం ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించనుంది, దీని తుది ప్రకటన కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## బొద్దింకను చంపబోయి అగ్ని ప్రమాదం



నగరంలో తీవ్ర కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే, ఒసాన్ నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే మహిళకు తన ఫ్లాట్‌లో బొద్దింకల సమస్య ఎక్కువైంది. వాటిని వదిలించుకునే ప్రయత్నంలో ఆమె అత్యంత ప్రమాదకరమైన 'ఫ్లేమ్ థ్రోయర్'ను ఉపయోగించింది. ఇది గ్యాస్ సాయంతో మంటలను ఎగదోసే పరికరం. ఈ పరికరాన్ని ఉపయోగించి బొద్దింకలను చంపడానికి ప్రయత్నించింది. అయితే, ఆమె ప్రయత్నం బెడిసికొట్టింది. బొద్దింక చావకపోగా, మంటలు క్షణాలలోనే ఇంట్లోని వస్తువులకు అంటుకుని వేగంగా ఎగసిపడ్డాయి. ఫ్లాట్ అంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ఈ దట్టమైన పొగ పక్కనే ఉన్న ఇతర ఫ్లాట్లలోకి కూడా వ్యాపించింది. పక్క ఫ్లాట్‌లో నివసిస్తున్న చైనా దంపతులు ఈ పొగను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు, పొగ నుంచి తప్పించుకునే ప్రయత్నంలో, ఆ దంపతులు ముందుగా తమ రెండు నెలల బిడ్డను కిటికీ గుండా పొరుగింటి వ్యక్తికి సురక్షితంగా అందించారు. ఆ తరువాత భర్త కూడా ఫ్లాట్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే, పొగ తీవ్రత ఎక్కువ కావడంతో దారి సరిగా కనిపించక భార్య ఫ్లాట్‌లోనే ఉండిపోయింది. పొగకు ఊపిరి ఆడక ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో మరికొంత మంది నివాసితులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ఈ దుర్ఘటనకు కారణమైన మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక బొద్దింకను చంపేందుకు చేసిన ప్రయత్నం కారణంగా ఒక అమాయకురాలైన మహిళ ప్రాణాలు కోల్పోవడం ఒసాన్ నగరంలో విషాదాన్ని నింపింది.

## అయ్యప్ప సేవలో ద్రౌపది ముర్ము

నిబంధనలు సడలించి, వాహనాల్లో శబరిమల చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. శబరిమలకు చేరుకునే క్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పెద్ద ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆమె హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ప్రమాదం ప్రాంతంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఊహించని సంఘటన జరిగింది. హెలిప్యాడ్ ఒక్కసారిగా కుంగిపోయింది.

**– హెలిప్యాడ్ కూలిపోవడంతో ఆందోళన**

హెలికాప్టర్ చక్రం హెలిప్యాడ్ కాంక్రీట్‌లో కూరుకుపోయింది. ఈ అకస్మాత్తు పరిణామంతో అక్కడ కొంత ఆందోళన నెలకొంది. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు వెంటనే స్పందించి, ఆ సమస్యను సరిచేశారు. అనంతరం రాష్ట్రపతి తన పర్యటనను కొనసాగించి, శబరిమలకు చేరుకుని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు.

## శ్రీలంకలో పట్టపగలే ప్రతిపక్ష నేత దారుణ హత్య

జరిగింది. ఒక ఆగంతకుడు కార్యాలయంలోకి చొరబడి రివాల్వర్‌తో ఆయనపై పలుమార్లు కాల్పులు జరిపాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన విక్రమశేఖర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. దాడి సమయంలో కార్యాలయంలో ఇతరులు ఉన్నప్పటికీ, వారికి ఎలాంటి హాని జరగలేదు. కాల్పులు జరిపిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ హత్య వెనుక ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. హంతకుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెలిగమ కౌన్సిల్‌పై ఆధిపత్యం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన రాజకీయ పోరు నడుస్తోందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

## గల్ఫ్ ప్రవాసులకు అండగా 'ప్రవాసాంధ్ర భరోసా'

సాదరంగా ఆహ్వానించారు. ఈ మూడు రోజుల పర్యటనలో ఆయన పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**– ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకం ప్రారంభం**

గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులకు ఆర్థికంగా భరోసా కల్పించే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు 'ప్రవాసాంధ్ర భరోసా' అనే ప్రత్యేక బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద దురదృష్టవశాత్తు గల్ఫ్ ప్రవాసీయులు మరణిస్తే, వారి కుటుంబానికి రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం పరిహారంగా అందనుంది. ఈ పథకం ఆపదలో ఉన్న ప్రవాసీ కుటుంబాలకు, ముఖ్యంగా కష్టకాలంలో వారికి అండగా నిలుస్తుందని టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ తెలిపారు.

**– ప్రవాసీయులతో భారీ సమావేశం**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రవాసీయులతో ఒక భారీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వివిధ గల్ఫ్ దేశాల నుంచి టీడీపీ అభిమానులు, ప్రముఖులు, ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో దుబాయ్‌కు చేరుకుంటున్నారు. ఈ సమావేశంలో ప్రవాసాంధ్రుల సమస్యలు, రాష్ట్ర



అభివృద్ధిలో వారి పాత్ర వంటి అంశాలపై సీఎం ప్రసంగించే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా గల్ఫ్ దేశాలలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై కూడా సీఎం దృష్టి సారించనున్నట్లు సమాచారం.

## వివేకా కేసులో మరో మలుపు

చేసుకున్నారు.

**– 2023 నవంబర్ 28న ఘటన: బీటెక్ రవి**

విచారణ ముగిసిన అనంతరం బీటెక్ రవి మీడియాతో మాట్లాడుతూ, "పోలీసులు విచారణకు పిలవడంతో హాజరై, కర్నూలు ఎస్పీకి నా వాంగ్మూలం ఇచ్చాను. 2023 నవంబర్ 28న దస్తగిరి ఉంటున్న బ్యారక్‌లోకి చైతన్య రెడ్డి వెళ్లడం నేను స్పష్టంగా చూశాను. నా బ్యారక్ సరిగ్గా దానికి ఎదురుగానే ఉంది" అని ఆయన వివరించారు. ఈ ఘటనపై తాను ఆ రోజే జైలు అధికారులను ప్రశ్నించినా వారు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.

**– కుట్ర దాగి ఉందని అనుమానం**

"వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న వ్యక్తి బ్యారక్‌లోకి నిందితుడి కుమారుడిని ఎలా అనుమతిస్తారని ఆ రోజే జైలు అధికారి ప్రకాశ్‌ను ప్రశ్నించాను. కానీ, అధికారులు నా మాటలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఆరోజు ఏం జరిగిందనేది ఎస్పీకి కూలంకషంగా వివరించాను" అని బీటెక్ రవి తెలిపారు. జైలుకు వచ్చి మరీ దస్తగిరిని బెదిరించడం వెనుక పెద్ద కుట్ర ఉందని తాను భావిస్తున్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఈ వాంగ్మూలం మరో కీలక మలుపు తిప్పే అవకాశం ఉంది.

## ఆర్థిక హక్కులను వినియోగించుకోండి

భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తర్వాత లబ్ధిదారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, లేదా నామినీ వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయని చెప్పారు. ఆర్థిక సంస్థలు సాధ్యమైనంత వరకు లబ్ధిదారులు లేదా వారి చట్టపరమైన వారసులను సంప్రదించి ప్రయోజనాలు అందించడానికి కృషి చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో అది సాధ్యం కావడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కారణంగా పెద్ద మొత్తంలో నిధులు బ్యాంకులు, బీమా సంస్థలు మరియు ఇతర ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయని రూపంలో నిల్వగా మిగిలిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో, భారత ప్రభుత్వం సమన్వయంతో ఐదు ప్రధాన ఆర్థిక సంస్థలు ౹ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ), ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్ డీఏఐ), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్ డీఏ), ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఎఫ్ఈపీఎఫ్ఏ) కలిసి మూడు నెలల ప్రచారాన్ని ప్రారంభించాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి, సరైన పత్రాలతో సులభంగా క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించబడుతుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం (గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మెకానిజమ్) కూడా ఈ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేయబడిందని వివరించారు. "తమ ఆర్థిక హక్కులను వినియోగించుకోండి. క్లెయిమ్ చేయని నిధులను ఇప్పుడే క్లెయిమ్ చేసుకొని, మరచిపోయిన ఆర్థిక ఆస్తులను కొత్త అవకాశాలుగా మార్చుకోండి." అని కలెక్టర్ సూచించారు.

## ఏపీకి వాయుగుండం ముప్పు

అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "అత్యవసరమైతే తప్ప ఎవరూ ప్రయాణాలు చేయవద్దు. ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం" అని ఆమె స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు (ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్), పోలీసు, అగ్నిమాపక సిబ్బందిని సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ పనిచేసేలా చూడాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులపై హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చిందని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజలు 112, 1070, లేదా 18004250101 నెంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

## పిడుగుపాటుకు ఇద్దరు వ్యవసాయ మహిళా కూలీలు మృతి

పిడుగు పడడంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో గాయపడిన నీలం మాణిక్యమ్మను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. ఈ వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతూ మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

**– పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు**

అల్పపీడనం దృష్ట్యా వాతావరణ శాఖ పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ప్రకాశం, వైఎస్ఆర్ కడప, పొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పల్నాడు జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35-55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద ఉండరాదని సూచించింది.

**– హోంమంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష**

వాయుగుండం బలపడనున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాల నేపథ్యంలో ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో హోంమంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్‌లు పంపించాలని సూచించారు. సహాయకచర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు జిల్లాల్లోని కంట్రోల్ రూమ్స్ 24/7 అప్రమత్తమంగా ఉండాలన్నారు. అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101 అందుబాటులో ఉంటాయని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రైతులపైకి దూసుకెళ్లిన బొలెరో

మన గళం, అల్లూరి జిల్లా: అక్టోబర్ 22, 2025 : ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో బొలెరో వాహనం బీభత్సం సృష్టించింది. ఈ ఘోర ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. జిల్లాలోని జీకే వీధి మండలం రింతాడ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. రహదారి పక్కన కూరగాయలు విక్రయిస్తున్న రైతులపైకి బొలెరో వాహనం వేగంగా దూసుకెళ్లింది.

**– ఆటోను ఢీకొట్టి రైతులపైకి దూసుకెళ్లిన వాహనం**

ఈ ప్రమాదం జరగడానికి ముందు బొలెరో వాహనం ముందుగా ఒక ఆటోను ఢీకొట్టింది. ఆ తర్వాత అదుపు తప్పి కూరగాయల వ్యాపారం చేస్తున్న రైతులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మొత్తం 15 మందికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారందరినీ చింతపల్లిలోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తులసమ్మ అనే మహిళ మృతి చెందింది.

**– 9 మంది పరిస్థితి విషమం, డ్రైవర్ అరెస్ట్**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

**– జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు**



మనగళం, కర్నూలు సిటీ : బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేనేలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. కర్నూలు లోని నాగేశ్వరరావు యాదవ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ సంఘం దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు షణ్ముఖంతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై బీసీలు ఆందోళనలు చేసి 42 శాతం రిజర్వేషన్లు సాధించారని కొందరు కుట్ర చేసి రిజర్వేషన్లు అందకుండా చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీలకు 26 శాతం నుంచి 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారని తెలిపారు. వైసీపీ నాయకులు బీసీ రిజర్వేషన్లపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో పాటు ఇప్పటికే కొన్ని అమలు చేశారన్నారు. షణ్ముఖం మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అవిర్భావమే బీసీల అభివృద్ధి కోసం అన్నారు. కూటమి ప్రభుత్వం లో బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బీసీ నేతలు రాంబాబు, సుజాత, కృష్ణాజీరావు, శివన్న, గణేష్, బీసన్న ఈశ్వరయ్య, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం హామీల అమలుపై దృష్టి సారించండి

**– జిల్లా కలెక్టర్లను ఆదేశించిన సీసీఎల్ఏ జయలక్ష్మి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని సీసీఎల్ఏ జయలక్ష్మి సూచించారు. ఇల్లు లేని వారికి ఇంటి సౌకర్యం కల్పించడం, మూడవ విడత రీ సర్వే ను త్వరగా పూర్తిచేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఉదయం విజయవాడ నుండి సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన వల ప్రకారం ఇల్లులేని వారికి ఇంటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న మూడో విడత రీ సర్వే పెండింగ్ పనులను ను త్వరగా పూర్తి చేయాలని, హౌసింగ్ ఫర్ ఆల్ కు సంబంధించి రివ్యూ చేసి కాలనీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్క రించాలని ఆదేశించారు. అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాకు వచ్చినప్పుడు ఇచ్చిన వాగ్ధానాల పై చర్యలు తీసుకుంటున్నామని, నివేదిక సమర్పిస్తామన్నారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ , డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, అగ్రికల్చర్ జేడీ వరలక్ష్మి, ఆర్డిఓ సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగ ప్రసూన, సునీత బాయి, ఏడీ సర్వే ముని కన్నన్, తహసీల్దార్ శ్రీనాథ్, సూపరింటెండెంట్ ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువజనోత్సవాలు






మనగళం, కర్నూలు సిటీ : జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో కర్నూలు రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. కర్నూలు జిల్లా స్థాయి యువజనోత్సవాలకు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. జిల్లా అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు ప్రతి రంగంలో సత్తా చాటుతున్నారని, విజేతలుగా నిలవాలని కోరారు. యువత లోని సృజనత్మాకత, ప్రతిభ వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగ పాడుతాయాన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ యువతలో స్ఫూర్తి నింపేందుకు యువజన ఉత్సవాలు చాలా బాగా ఉపయోగపడతాయని, సాంస్కృతిక వైభవాన్ని పెంచుతాయన్నారు. అమ్మాయిలు అధిక సంఖ్య లో పాల్గొనడం అభినందనీయమన్నారు. సెట్కూరు సీఈఓ డా. కె. వేణు గోపాల్ మాట్లాడుతూ ఈ జిల్లా యువజనోత్సవాలలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు,ఇన్నోవేషన్ – సైన్స్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి లో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయి విజేతలు జనవరి 12 వ తేది న్యూ ఢిల్లీ లో జరుగు జాతీయ స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. మొదటి బహుమతి పొందిన విజేతలు ఇన్నోవేషన్–సైన్స్ మేళాలో జి.పుల్లయ్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ టీం, జానపద నృత్యం గ్రూపులో మల్లికా గ్రూప్, డా.బి. ఆర్. అంబేద్కర్ గురుకులం, దిన్నదేవరపాడు, జానపద గీతం గ్రూపులో నమిత గ్రూప్, జి.పుల్లా రెడ్డీ ఇంజనీరింగ్ కాలేజీ పెయింటింగ్ లో జి.కార్తికేయ, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల పోయెట్రీ లో షైక్ నూర్ జహాన్, ఉస్మానియా మహిళా కాలేజీ డిక్లమేషన్ లో టి.కావ్యశ్రీ, లక్ష్మి శ్రీనివాస కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్ స్టోరీ రైటింగ్ లో వి.పూజిత, జి. పుల్లయ్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ గెలుపొందారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేయడమైనది. కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖాధికారి శ్యామ్యూల్ పాల్, జిల్లా ఇంటర్ మీడియట్ బోర్డు రీజియనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ లాలెప్ప, జిల్లా పరిషత్ సీఈఓ నాసరా రెడ్డి, జిల్లా టూరిజం అధికారి లక్ష్మినారాయణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శ్రీ మోహన్ కుమార్, యువతీ యువకులు పాల్గొన్నారు.

# కిసాన్ సీడ్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు మండలం నిర్జూరు గ్రామానికి చెందిన వరి విత్తనాలు వేసి నష్టపోయిన18 మంది రైతులను తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ డాక్టర్ సిరిని బాధిత రైతులతో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిర్జూరురైతులు సుమారుగా 50 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారన్నారు. అందుకు అవసరమైన సోనామ సూరు వడ్లు (విత్తనాలు) కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న కిసాన్ సీడ్స్ నుండి కొనుగోలు చేశారన్నారు. పంట ఏపుగా వచ్చింది కానీ కంకులు లేని వరి మొక్కలు అత్యధికంగా ఉన్నాయని, దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని ఆయన కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి కోటకొండ సూరి, రైతులు కృష్ణ వెంకటేశ్వర్లు, తెలుగు రాముడు, శ్రీనివాసులు, గిడ్డయ్య, తెలుగు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన చిన్నారి



మనగళం, పత్తికొండ : ఈ ఫొటోలో ఉన్న చిన్నారి తప్పిపోయింది. పత్తికొండ టౌన్ లోని స్టేట్ బ్యాంక్ వద్ద తల్లి తండ్రుల నుంచి తప్పి పోయి ఒంటరిగా ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఈ చిన్నారి పోలీసు స్టేషన్ పోలీసుల వద్ద ఉంది. ఈ చిన్నారిని గుర్తించే వ్యక్తులు తల్లిదండ్రులకు సమాచారం అందజేయగలరు. ఈ పాపను తల్లి తండ్రుల చెంతకు చేర్చుటకు తమ వంతు సహకారం అందజేయాలని పత్తికొండ పోలీసులు కోరారు.

# నేటి నుంచి శ్రీశైలంలో కార్తిక మాసోత్సవాలు

**– అభిషేకాలు రద్దు, విడతల వారీగా మల్లన్న స్పర్శ దర్శనం**



మనగళం శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 21 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. కార్తిక మాసంలో రూ.5 వేల గర్భాలయ అభిషేకం టికెట్లు, రూ.1500 సామూహిక అభిషేకం టికెట్లు రద్దు చేసినట్లు తెలిపారు. రోజూ విడతల వారీగా మల్లి కార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి అంతరాలయంలో కుంకు మార్చనలు నిలిపేసి.. ఆశీర్వచన మండపంలో నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, నవంబర్ 14న కోటి దీపోత్సవం, 18న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హోమాలు, కల్యాణాలు యథావిధిగా జరుగుతాయన్నారు.

# ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలులోని జిల్లా కోర్టు నందు గల లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ఆఫీస్ లో తాత్కాలిక పద్ధతిన ఒక సంవత్సరం పాటు పనిచేయుటకు ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడవ తరగతి పాస్... ఇంటర్ ఫెయిల్ అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తులను 01-11-2025 సాయంత్రం 05.00 గంటల లోపు చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిస్టిక్ కోర్ట్ కాంప్లెక్స్, కర్నూలుకు రిజిస్టర్ పోస్ట్, కొరియర్ లేదా స్వయంగా అందజయాలన్నారు.

# పోరాట యోధుడు కొమరంభీమ్

మనగళం, కర్నూలు సిటీ : ఆదివాసీల ఆత్మగౌరవ పోరాట యోధుడు కొమరంభీమ్ అని ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. కర్నూలు జిల్లా కార్యాలయంలో కొమరంభీమ్ 124వ జయంతిని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో జన్మించిన కొమరంభీమ్ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడరని గుర్తు చేశారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన అలుపెరుగని గిరిజన ఉద్యమ నాయకుడు కొమరంభీమ్ అని ఆమె కొనియాడారు. కొమరంభీమ్ ఆశయాలను సాధన దిశగా ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# చిన్నపిల్లల సంరక్షణ సంస్థలను తనిఖీ చేయాలి

**– చట్ట విరుద్ధంగా ఉన్న వాటిని రద్దు చేయండి – జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఉన్న చిన్నపిల్లల సంరక్షణ సంస్థలను తరచూ తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి అమలుపై కమిటీ మెంబర్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ సంస్థలకి ఎంత నిధులు వచ్చాయి? ఏ విధంగా ఖర్చు పెట్టారు? వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఐసీడీఎస్ పీడీ విజయని ఆదేశించారు. జిల్లాలో ప్రైవేటు సంస్థల నిర్వహించబడుతున్న చిన్న పిల్లల సంరక్షణ సంస్థలను చివరిగా ఎప్పుడు తనిఖీ చేశారు? అందుకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలో రిజిస్టర్ కాని పిల్లల సంరక్షణ సంస్థలను ఏ విధంగా నడిపిస్తున్నారని, వాటిని తనిఖీ చేసి యాక్ట్ కి విరుద్ధంగా ఉండే వాటిని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోక్సో చట్టం కి సంబంధించిన నివేదికలు త్వరితగతిన పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలు నియంత్రించే విధంగా మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారితో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీం లు సమర్థవంతంగా పని చేసి బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జనవరి 2025 నుండి ఇప్పటివరకు షాపులలో పని చేసే బాల కార్మికులను ఎంతమందిని గుర్తించారని కలెక్టర్ కార్మిక శాఖ అధికారిని ఆరా తీయగా 22 మందిని పట్టుకున్నామని వివరించారు. మిషన్ శక్తి లో భాగంగా వన్ స్టాప్ సెంటర్, నారీ ఆదాలత్, శక్తి సదన్, సఖీ నివాస్ గురించి సమీక్ష నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. ఆదోని లో కూడా వన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, డీ ఆర్ డీ ఏ పీడీ రమణ రెడ్డి, సీపీఓ భారతి, అదనపు డీఎం హెచ్ ఓ డా.భాస్కర్, డీపీఓ భాస్కర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, కమిటీ మెంబర్ లు తదితరులు పాల్గొన్నారు.


## డి.ఎస్.పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం



మన గళం డోన్ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీని లి" పోలీస్ కమేమరేషన్ దే" లి గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకునే ఈ దినం సందర్భంగా, డోన్ సబ్ డివిజన్ డి.ఎస్.పీ. పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక మహా రక్తదాన శిబిరం అక్టోబర్ 25వ తేదీ, శనివారం 2025న, డోన్ పట్టణంలోని క్లబ్ హౌస్ (మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా, రైల్వే స్టేషన్ రోడ్, డోన్) వద్ద నిర్వహించబడనుంది.

ఈ సత్కార్య కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మాత్రమే కాకుండా, సాధారణ ప్రజలు కూడా విస్తృతంగా పాల్గొని రక్తదానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. రక్తదానం ఒక మహోన్నత సేవ. ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలను కాపాడగలదు.ప్రత్యేకంగా డోన్ టౌన్, డోన్ రూరల్, ప్యాపిలి, రాచర్ల, జలదుర్గం, బేతంచర్ల ప్రాంతాల ప్రజలు ఈ మహా రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయవలసిందిగా డీఎస్పీ శ్రీ పి. శ్రీనివాస్ మనస్ఫూర్తిగా కోరుతున్నారు. "ఒక చుక్క రక్తం – మూడు ప్రాణాల బ్రతుకుదెరువు" అనే నినాదంతో అందరం కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.

## విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులపై సమావేశం





మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కభర్ది, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం కర్నూలు, నంద్యాల, నారాయణపేట కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విక్టిమ్ కంపన్సేషన్, అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, హిట్ అండ్ రన్ కేసుల పై, అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు మంజూరు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విక్టిమ్ కాంపెన్సేషన్లో రెండు కేసులలో బాధితులకు . 12,50,000 నష్ట పరిహారం అవార్డును మంజూరు చేశారు. కర్నూలు నంద్యాల జిల్లాలలో ఉన్న హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ నందు జైలులో ఉన్న ఖైదీల విడుదల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షను నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలో ఆధార్ కార్డు లేని 125 మంది అనాథ పిల్లలను గుర్తించడం జరిగింది. ఇందులో 56 మందికి ఆధార్ కార్డులు ఇప్పించడమైనది. మిగతా వారికి త్వరగా ఆధార్ కార్డు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ 2024 –2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్యువల్ అకౌంట్స్ పై రివ్యూ నిర్వహించారు.

## పింఛన్లు మంజూరు చేయండి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని 48వ వార్డులో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. ఈ మేరకు బుధవారం నగరపాలక కార్యాలయంలో మేనేజర్ చిన్నరాముడుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసమ్మ, లక్ష్మమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నా బార్డ్ వారి ఆర్థిక సహాయంతో రైతులకు పనిముట్లు





మన గళం ప్యాపిలి మండల పరిధిలోనికలచట్ల గ్రామం నందు నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో కలచట్లవాటర్ షెడ్ ప్రోగ్రాం భాగంలో కస్టమర్ హైరింగ్ సెంటర్ వ్యవసాయ పనిముట్లు అద్దెకు ఇచ్చే సెంటర్ను ఏర్పాటు చేయడం జరిగినది దానితో పాటుగా జస్మిత రైతు మిత్ర గ్రూప్ ద్వారా డ్రోన్ స్ప్రేను కూడా ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ కె.ఆర్.డి కార్తీక్ , సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్మెంట్ ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి , అగ్రికల్చర్ ఏ డి ఏ ఎం సునీత , అగ్రికల్చర్ ఏవో ప్యాపిలి ఏ రాజేష్ ఏ ఈ ఓ మధుసూదన్ విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ జోషిబా యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోకురామయ్య ఏ పి జి పి బ్యాంకు మేనేజర్ సతీష్ రెడ్డి గ్రామ సర్పంచ్ బి రమాదేవి వాటర్షెడ్ సిబ్బంది సుబ్రహ్మణ్యం రాకేష్ మరియు కమిటీ సభ్యులు ట్రెజరర్ రవి వైస్ చైర్మన్ రంగస్వామి గ్రామ ప్రజలు కలచట్లప్రసాద్, ఆంజనేయులు, భీమన్న తదితరులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో మొదటిగా కార్తీక్ మాట్లాడుతూ కలచట్ల గ్రామం నందు వాటర్షెడ్ కార్యక్రమాలతో పాటుగా అనేక రకాలైనటువంటి పనులను నా బార్డ్ వారి ఆర్థిక సహకారంతో ముందుకు తీసుకెళుతున్నటువంటి సమస్త ఎస్ ఆర్ ఐ డి వారికి మరియు గ్రామ ప్రజలకు అభినందనలు తెలియజేస్తూ ప్రభుత్వ రాయితీతో డ్రోన్ స్ప్రేను కొనుగోలు చేసిన జశ్మిత రైతు మిత్ర గ్రూపు వారికి అభినందనలు తెలియజేశారు .అదేవిధంగా డ్రోన్ స్ప్రే దాదాపుగా 9,80,000/- అందులో ప్రభుత్వ



రాయితీ 7,84,000/- యూనియన్ బ్యాంకు నుండి రుణం 1,96,000/- ద్వారా లబ్ధి పొందడం జరుగుతుంది ఈ కార్యక్రమము ప్యాపిలి మండలం నందు మొట్టమొదటిగా ఏర్పాటు చేయడంలో జరిగినది కావున ఈ డ్రోన్ స్ప్రే ని ఉపయోగించుకుని రైతులందరూ తక్కువ నీటి వినియోగించడం నీరు సమర్ధవంతంగా లేని ప్రదేశంలో కూడా ఈ స్ప్రే ద్వారా పిచికారి చేసుకోవచ్చని రాజేష్ గారు తెలియజేయడం జరిగినది.

## యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు దోర్నాల మండలం రామచంద్రకోట గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాఉద్యమం ఘనంగా నిర్వహించారు.



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనలలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల ఆరోగ్య హక్కును హరించే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని డిమాండ్



చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ు వైఎస్సార్ రాజశేఖరరెడ్డి కాలంలో ప్రారంభమైన ప్రజా వైద్య సేవలు రాష్ట్రంలో విస్తృతంగా కొనసాగేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో రాజకీయాలు ఆడకూడదని, ప్రజల ఆరోగ్యం కోసం స్థాపించిన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వడం తీవ్ర అన్యాయమని తెలిపారు. దోర్నాల మండలంలోని రామచంద్రకోట గ్రామంలో



నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా ఉద్యమానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది.

## పిల్లల భద్రతకు పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పిల్లల భవిష్యత్తు భద్రతకు, ఆర్థిక స్థిరత్వం కోసం పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ అనే పథకం కింద 18 సంవత్సరాలు వయసు పూర్తి చేసుకున్న 7 మంది పిల్లలకు పోస్ట్ ఆఫీసు సేవింగ్స్ అకౌంట్ పాస్ పుస్తకాలను కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద పిల్లలు స్వతంత్రంగా జీవించడానికి, ఆత్మవిశ్వాసం , ప్రేరణ కోసం సాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. కరోనా మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు చనిపోయి ఆ ఇంటి పిల్లలు చదువులకు దూరం అవుతున్న నేపథ్యంలో, వారికి ఆర్థిక సాయం అందించడానికి భారత ప్రభుత్వం ఈ పథకాన్ని లాంచ్ చేసిందన్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో 7 మంది పిల్లలకు పోస్ట్ ఆఫీస్ బ్యాంక్ ఖాతాలో కేంద్ర ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా ను ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం అక్కడే ఉన్న పిల్లలతో కలెక్టర్ మాట్లాడుతూ బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం





మనగళం, కర్నూలు సిటీ : కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా బుధవారం కర్నూలు నగరంలోని శ్రీ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులకు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు.

## జాతీయ క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మనగళం, కర్నూలు సిటీ : యువజన సర్వీసు, క్రీడాల శాఖ 2025 సంవత్సరానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎన్వీ రాజు ఓ ప్రకటన విడుదల చేశారు. 28-10-2025 వ తేది రాత్రి 11:59 గంటల లోపు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఇంధన మార్గదర్శకతలో సమతుల్యత అవసరం

పెరుగుతున్న విద్యుత్ వినియోగం దేశ ఆర్థిక ప్రగతికి సంకేతం కావచ్చు, కానీ అదే సమయంలో పర్యావరణంపై దీని ప్రభావం అధికమవుతోంది. కోయిలా, డీజిల్, పెట్రోలు వంటి సంప్రదాయ ఇంధన వనరుల వినియోగం వలన గాలి కాలుష్యం, కార్బన్ ఉద్గారాల స్థాయి పెరుగుతూ వాతావరణ మార్పులను వేగవంతం చేస్తున్నాయి. అభివృద్ధి కాంక్షించే దేశంగా భారతదేశం, స్వచ్ఛమైన ఇంధన మార్గాలను అనుసరించకపోతే, దీర్ఘకాలంలో ఆరోగ్యముతో పాటు ఆర్థిక స్థిరత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

హరిత ఇంధన మార్గం అనుసరించడం అనివార్యమైన నిర్ణయంగా మారుతోంది, కాని దీనికి అనేక అడ్డంకులు కూడా ఉన్నాయి. సౌరశక్తి, గాలిశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులను విస్తృతంగా వినియోగించాలంటే మౌలిక సదుపాయాల కొరత, అధిక ప్రాథమిక పెట్టుబడులు, నిపుణుల లోపం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఈ రంగానికి ఉత్సాహాన్నిస్తోందని చెప్పినప్పటికీ, వాటి అమలులో స్పష్టత లేకపోవడం గమనార్హం.

ఇంధన మార్పిడి ప్రక్రియ సామాజికంగా సమవాయంతో ముందుకెళ్లాలి, పేద ప్రజలపై దీని ప్రభావం తక్కువగా ఉండేలా చూడాలి. హరిత ఇంధన విధానాల ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇందులో ఏర్పడే ఖర్చులను ప్రజలపై మోపడం వల్ల ప్రజలలో వ్యతిరేకత కలిగే అవకాశం ఉంది. అందువల్ల సామాజిక దృక్పథంతో కూడిన విధానాలు తీసుకోవడం అవసరం.

పరిశుభ్రమైన ఇంధన వనరుల వైపు మారడం వల్ల మాత్రమే భారత్ గ్లోబల్ స్థాయిలో పర్యావరణ బాధ్యతను చాటగలదు. అంతర్జాతీయ ఒప్పందాలు, కార్బన్ ఎమిషన్స్ తగ్గించే లక్ష్యాలను సాధించాలంటే, దేశీయంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాల్సి ఉంటుంది. దీనికోసం ప్రభుత్వాలే కాక, ప్రైవేట్ రంగం, పౌర సమాజం కూడా భాగస్వాములవ్వాలి.

నవీన సాంకేతికత వినియోగం హరిత ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగలదు. విద్యుత్ నిల్వ సాంకేతికత, హైడ్రోజన్ ఇంధన అభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల వృద్ధి వంటి అంశాలను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధి చేయవచ్చు. పరిశోధనలకు నిధులు కేటాయించడం ద్వారా స్వదేశీ పరిష్కారాలను ముందుకు తీసుకురావచ్చు. రాష్ట్రాలు, కేంద్రం మధ్య సమన్వయం లేకపోతే హరిత ఇంధన లక్ష్యాలు కేవలం ప్రకటనా పరంగానే మిగిలిపోతాయి. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక అవసరాలు ఉంటాయి కనుక స్థానిక వనరులను పరిగణనలోకి తీసుకుని విధానాలు రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వాల పాలసీలకు కేంద్రం పూరకంగా నిలబడితే మాత్రమె విజయవంతమైన మార్పిడి సాధ్యం అవుతుంది. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ విధానమూ విజయవంతం కాలేదుబీ ఇదే సూత్రం ఇంధన మార్పిడి విషయంలోనూ వర్తిస్తుంది. వినియోగదారుల మైనపు దృక్పథం, విద్యుత్ పొదుపు పట్ల అవగాహన, పునరుత్పాదక ఇంధన వినియోగం పట్ల నమ్మకం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు ప్రజలలో చైతన్యం కలిగించడంలో కీలక పాత్ర పోషించాలి.

ఇంధన రంగంలో సమతుల్య మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా భారత్ పర్యావరణ పరిరక్షణలో ఓ మోడల్ దేశంగా నిలవగలదు. కోయిలా వంటి సంప్రదాయ ఇంధనాలను పూర్తిగా విస్మరించకపోయినా, వాటి వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ, పునరుత్పాదక ఇంధనాల వృద్ధిని ప్రోత్సహిస్తూ ఒక సమతులిత దృక్పథాన్ని అవలంబించాల్సిన అవసరం మన ముందుంది.మన దేశం అభివృద్ధి చెందుతున్న సందర్భంలో, విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో, సంప్రదాయ ఇంధన వనరులైన కోయిలా, పెట్రోలు వంటి ఆధారాలపై ఆధారపడటం వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పునరుత్పాదక ఇంధన వనరుల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అయితే, ఈ మార్పు సాధించడం అంత సులువు కాదు. పునరుత్పాదక ఇంధనాల అభివృద్ధికి సరైన మౌలిక సదుపాయాలు లేవు. పెట్టుబడుల లోపం, సాంకేతిక పరిమితులు, పాలసీ స్థాయిలో స్థిరత లేకపోవడం వంటి అనేక అడ్డంకులు ఉన్నా, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ మార్గాన్ని అనుసరించడం అత్యవసరం. ఇంధన మార్పిడి ప్రక్రియలో పేద మరియు మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడమే కాకుండా, వాతావరణ మార్పులను ఎదుర్కొనే దిశగా దేశం ముందుకు సాగాలి.

– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు, డిజైనర్ టెక్ గురు. 8897975262

# ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

- స్వార్థప్రయోజనాలు చూసుకుంటున్న సీఎం చంద్రబాబు
- తన బంధువులు, తెలుగు తమ్ముళ్లకు వైద్య కళాశాలలను హస్తగతం చేసేందుకు కుట్ర
- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి





మనగళం, కల్లూరు : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్ భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు అర్బన్ పరిధిలోని 31వ వార్డులో బుధవారం కాటసాని రామ్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా "రచ్చబండ – కోటి సంతకాల సేకరణ" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కాటసాని ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కార్ కుట్రలు పన్నుతోందని వివరించారు. సంతకాల సేకరణలో పాల్గొని వైసీపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాటసాని రామ్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం, వైద్య విద్య అందించాలని భావించి రూ.8 వేల కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్ జగన్ హయాంలో కోవిడ్ తర్వాత ఏడు కళాశాలలు పూర్తి చేశారని, ఐదు మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. అయితే నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల కోడ్‌తో రెండు కళాశాలలు అందుబాటులోకి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తున్నారు. ఇది పేదలకు వైద్య విద్యను దూరం చేయడమే.. లక్షల కోట్ల ఆదాయం వచ్చేలా చంద్రబాబు తన బంధువులు, టీడీపీ తమ్ముళ్లకు కళాశాలలను హస్తగతం చేయడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కూటమి నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు పేదలకు వైద్య విద్య దూరం అవుతుందని, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాల్సిన కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలకు వైద్యం కూడా దూరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు కుట్రలకు అడ్డుకట్ట వేసే బాధ్యతను వైసీపీ తీసుకుందని, ఈ ప్రజా ఉద్యమంలో మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, యువత, రాజకీయాలకు అతీతంగా పార్టీలు పాల్గొని మద్దతు తెలుపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, వార్డులోని సభ్యులు, అనుబంధం విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీరప్ప తాత దేవాలయ గోపుర ప్రారంభోత్సవానికి ఎంపీ నాగరాజుకు ఆహ్వానం



మనగళం, ఆలూరు : కర్నూలు జిల్లా ఆలూరు మండలం పెద్ద హోతూరు గ్రామంలోని శ్రీ హుచ్చు వీరప్ప తాత దేవాలయంలో నవంబర్ 3 వతేదీన గోపుర ప్రారంభోత్సవం, కళస ప్రతిష్టాపన మహోత్సవ నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి హాజరు కావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును పెద్ద హోతూరు గ్రామ పెద్దలు ఆహ్వానించారు. కర్నూలు నగరంలోని ఎంపీ కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసిన గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంపీకి ఆలయ విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం ఎంపీ నాగరాజు గ్రామంలో నెలకొన్న సమస్యల పై వారితో చర్చించారు.


## అవయవాలు దానం

మనగళం, కర్నూలు సిటీ : నంద్యాల జిల్లా, శ్రీశైలానికి చెందిన శీలం భాగ్యమ్మ అనారోగ్యంతో బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఈమె అవయవాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నలుగురు తమ జీవితం నిలబెట్టుకున్నారు. ఆమె గుండెను సేకరించిన కర్నూలు కిమ్స్ వైద్యులు వెంటనే చెన్నైకి బయలుదేరారు. అవయవదానంతో మానవత్వం చాటుకున్న ఆమె కుటుంబ సభ్యులను స్థానికులు ప్రశంసించారు.




# రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవల కోసం ఆశతో ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తారని, రెవెన్యూ సేవల విషయంలో ఆలస్యం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని 18వ సచివాలయంలో రెవెన్యూ సంబంధిత సేవలపై ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో 2025 జనవరి నుండి సెప్టెంబర్ 30 వరకు ప్రజల నుండి అందిన 332 దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎక్కువశాతం దరఖాస్తులు వివిధ మండలాల్లో ఉన్న భూములకు సంబంధించినవని, సచివాలయ పరిధిలోని ప్రజల భూసంబంధిత అంశాలు ఇతర మండలాలకు చెందినవని ఆమె గుర్తించారు. తనిఖీలో ఒకే ఒక మ్యూటేషన్ దరఖాస్తు మాత్రమే ఎన్జీవోస్ కాలనీ పరిధిలోనిదని, మిగతా 331 దరఖాస్తులు ఇతర మండలాల పరిధిలో ఉన్న భూములపై నమోదై ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేసేలా సంబంధిత మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ స్థాయిలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే మండల రెవెన్యూ కార్యాలయాలకు పంపించి, సమయపరిమితిలో పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తనిఖీ సమయంలో రెవెన్యూ విభాగ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమిత్ షాకు పుట్టినరోజు శుభాకాంక్షలు



మనగళం, కర్నూలు సిటీ : కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా కు నంద్యాల జిల్లా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆయనకు సమృద్ధిగా ఆరోగ్యం, బలం ప్రసాదించాలని కోరారు. అమిత్ షా నిబద్ధత, దార్శనికతతో దేశానికి సేవ చేయడం కొనసాగించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకాంక్షించారు.

## హెవీ యూజ్ చేసినా వేడెక్కని మొబైల్

మనగళం, ఐక్యూ పదిహేను మొబైల్ లో వేసిన పద్నాలుగు వేల చదరపు మిల్లీమీటర్ల వాపర్ ఛాంబర్ ద్వారా ఎంతసేపు వాడినా ఫోన్ వేడెక్కదు. గేమింగ్, వీడియో కాల్స్ వంటి అధిక వినియోగ సమయంలో కూడా తక్కువ ఉష్ణోగ్రత %ఝుఅత్ఝుఅవం% అవుతుంది. ఇది అధికంగా మొబైల్ వాడే వినియోగదారులకు ఎంతో ఉపయోగపడే ఫీచర్‌గా నిలుస్తోంది. ఐక్యూ పదిహేను ఆరు పాయింట్ ఎనిమిది ఐదు అంగుళాల అమోలెడ్ టూకే డిస్‌ప్లేతో వస్తోంది. దీని రిఫ్రెష్ రేట్ నూర నలుబది హెర్ట్జ్ కాగా, పీక్ బ్రైట్‌నెస్ రెండు వేల ఆరు వందల నిట్స్ వరకు ఉంటుంది. డాల్బీ విజన్, హెచ్డీఆర్ పదిహేను ప్లస్ వంటి సాంకేతికతలు వీడియో కంటెంట్‌ను మరింత జీవంతంగా చూపించేందుకు సహాయపడతాయి. ఈ ఫోన్‌లో స్నాప్‌డ్రాగన్ ఎనిమిది ఎలైట్ జెన్ ఐదు ప్రాసెసర్ ఉంది. దీని తోపాటు లేటెస్ట్ అల్ట్రా ర్యామ్ మరియు యూఎఫ్ఎస్ నాలుగు పాయింట్ వన్ స్టోరేజ్ ద్వారా మొబైల్ పనితీరు మరింత వేగంగా ఉంటుంది. గేమింగ్, యాప్స్ స్విచింగ్, భారీ ఫైల్స్ హ్యాండ్లింగ్ వంటి అవసరాలకు ఇది పర్ఫెక్ట్‌గా పనిచేస్తుంది.

# ఇండస్ట్రియల్ సెక్టార్‌ను అభివృద్ధి చేయండి

- నూతన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వండి
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




మనగళం, నంద్యాల టౌన్: జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగాన్ని మరింతగా అభివృద్ధి పరచాలని, నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగ అభివృద్ధి ద్వారానే నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అందుకే నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి స్థాయి సహకారం అందించాలని, పరిశ్రమలు స్థాపించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించి, అన్ని అనుమతులను వేగవంతంగా మంజూరు చేయాలని సూచించారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశ్రమల స్థాపకులతో నేరుగా సమావేశమై, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించకపోతే జిల్లాలో వృద్ధి రేటు తగ్గే ప్రమాదం ఉందని, ప్రతి అధికారి సక్రమ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ విధానం ద్వారా అందిన దరఖాస్తులపై సమయానికి అనుమతులు ఇవ్వాలని సూచించారు. గత త్రైమాసిక కాలంలో మొత్తం 1,353 పరిశ్రమల దరఖాస్తులు అందగా, వాటిలో 1,278 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయబడ్డాయి, ఇంకా 75 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. పరిశీలనలో ఉన్న వాటిపై పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీస్ తదితర శాఖలు నిర్ణీత గడువులోపు చర్యలు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీల సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి పథకాల కింద జిల్లాలో ఉత్పాదక మరియు సేవా రంగాలకు చెందిన 25 యూనిట్లకు రూ. 210.37 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కమిటీ ఆమోదించింది. జిల్లాలో పారిశ్రామిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి, కొత్త పరిశ్రమలను ఆకర్షించేందుకు అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల టౌన్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి సంబంధిత విద్యా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అపార్ ఐడీ పురోగతిపై క్లస్టర్ హెచ్ఎంలు, ఎంఈఓలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ "అంగన్వాడీ స్థాయి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అపార్ ఐడీ కలిగి ఉండాలన్నారు. ఆధార్ కార్డు ప్రతి పౌరుడికి అవసరమైనట్లు, విద్యార్థులకు అపార్ ఐడీ కూడా అంతే ముఖ్యమైనదని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 85 శాతం విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్ పూర్తయిందని, మిగిలిన 15 శాతం విద్యార్థుల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అపార్ ఐడీ ద్వారా విద్యార్థులకు స్కాలర్షిప్స్, ప్రభుత్వ ప్రయోజనాలు, వివిధ విద్యా పథకాలు సులభంగా అందుతాయన్నారు. కొంతమంది విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేర్లు లేదా వివరాల్లో పొరపాట్లు ఉండటం వల్ల అపార్ ఐడీ జనరేషన్ ఆలస్యమవుతోందని గుర్తించిన కలెక్టర్, ఆధార్ కార్డులో ఉన్న తప్పులను తక్షణమే సరిచేసి ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా విద్యా అధికారి జనార్ధన్ రెడ్డి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఉర్దూ పత్రికల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమీషనర్





విజయవాడ (మనగళం ప్రతినిధి): రాష్ట్రం లోని ఉర్దూ పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తామని రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాధ్ తెలిపారు.ఉర్దూ న్యూస్ పేపర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బుధవారం కమీషనర్ ను కలిసి వివరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఉర్దూ పత్రికలకు తగిన న్యాయం చేస్తామన్నారు.ప్రభుత్వ ప్రకటనలకు సంబందించిన పెండింగ్ బిల్లులు మంజూరు కు చర్యలు తీసుకుంటామని తెలిపారు.త్వరలో కొత్తగా మీడియా లిస్ట్ లో పత్రికలు ఎంపానెల్మెంట్ కొరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రకటన జారీ చేస్తామన్నారు.అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి అక్రిడిటేషన్ మంజూరులో పీరియాడికల్సుకు తగిన న్యాయం చేయాలని ,అలాగే 8 పేజీలతో ప్రచురితమవుతున్న పత్రికల కు గతం కంటే ఎక్కువగా అక్రిడిటేషన్ లు మంజూరు చేయాలని,వి.ఐ.పీ లు,వి.వీ.ఐ.పీ ల పర్యటనల సందర్భంగా స్థానిక పత్రికలకు పాసులు మంజూరు చేయుటకు సమాచార ఉప సంచాలకులు తగు సూచనలు జారీ చేయాలని కోరారు.అన్ని సమస్యలను సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.డైరెక్టరును కలిసిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాసిర్ హుసేన్, కోశాధికారి సర్దార్ భాష తదితరులు ఉన్నారు.

# ఎక్కువ కాలం తరువాత బంగారం ధరల్లో భారీ తగ్గుదల



మనగళం : మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఇటీవల ఒక లక్ష ముప్పై వేల రూపాయలు దాటిన ధరలు ఇప్పుడు ఒక్కసారిగా రెండు వేల రూపాయలకు పైగా తగ్గిపోయాయి. మార్కెట్ వర్గాల ప్రకారం, బులియన్ మార్కెట్‌లో బంగారం ధరల పతనం కొనుగోలుదారులకు ఊపిరి పీల్చుకునేలా చేసింది. హైదరాబాద్ మార్కెట్‌లో స్వచ్ఛమైన ఇరవై నాలుగు క్యారెట్ల పదిగ్రాముల బంగారం ధర ఏకంగా మూడు వేల మూడు వందల ఎనభై రూపాయలకుపైగా తగ్గి ఇప్పుడు ఒక లక్ష ఇరవై ఏడు వేల రూపాయలకి చేరుకుంది. ఇదే సమయంలో ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర కూడా మూడువేల రూపాయల తగ్గుదలతో ఒక లక్ష పదహారు వేల ఆరొందల రూపాయల వద్ద స్థిరపడింది.

– దేశరాజధాని ఢిల్లీలో కూడా బంగారం ధరల్లో స్పష్టమైన పడిపోయే ధోరణి ఢిల్లీ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు తగ్గాయి. ఇక్కడ ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర ఒక లక్ష ఇరవై ఏడు వేల మూడు వందల యాభై రూపాయలుగా నమోదవగా, ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర ఒక లక్ష పదహారు వేల ఏడున్నూరల యాభై రూపాయల వద్ద ఉంది. ఇవి గత వారంతో పోలిస్తే కనిష్ఠ స్థాయిలో ఉన్న ధరలు. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర కూడా తగ్గింది. ప్రస్తుతం వెండి ధర ఒక లక్ష అరవై మూడు వేల తొమ్మిదిశాతం రూపాయల వద్ద ఉంది. గత వారం కంటే ఇది గణనీయమైన తగ్గుదలగా భావించబడుతోంది. వెండి పెట్టుబడిదారులు మరియు ఆభరణాల కొనుగోలుదారులకు ఇది మంచి అవకాశంగా మారింది. దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో బంగారం కొనుగోలు చేసే వినియోగదారులకు ఇప్పుడు ధరల తగ్గుదల ఒక శుభవార్తగా మారింది. పతనవుతున్న ధరల మధ్య కొనుగోలు చేస్తే మంచి లాభాలు పొందొచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. పెళ్లిళ్ల సీజన్‌కు ముందు ధరలు మరింతగా తగ్గే అవకాశముందన్న అంచనాలు కూడా మార్కెట్‌లో ఉన్నాయి.

# కృత్రిమ మేధస్సు రంగంలో మైక్రోసాఫ్ట్ విజయాల నేపథ్యంలో సత్యనాదెళ్లకు చరిత్రలోనే అత్యధిక వేతనం



మనగళం : మైక్రోసాఫ్ట్ సంస్థలో ముఖ్య పాత్ర పోషిస్తున్న సత్యనాదెళ్లకు ఈ ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా వేతనం పెరిగింది. కంపెనీ కృత్రిమ మేధస్సు రంగంలో చూపిన అభివృద్ధికి ప్రతిఫలంగా ఆయనకు అత్యధిక మొత్తంలో పారితోషికం లభించింది. గత ఏడాదితో పోలిస్తే ఆయన జీతం పెద్ద ఎత్తున పెరిగింది. సత్యనాదెళ్లకు లభించిన మొత్తం పారితోషికంలో ప్రధాన భాగం స్టాక్ అవార్డుల రూపంలో ఉంది. కంపెనీ విజయాలను దృష్టిలో ఉంచుకొని ఆయన్ను మెచ్చి బహుమతుల రూపంలో ఈ అవార్డులు మంజూరు చేశారు. అలాగే నగదు రూపంలో ప్రోత్సాహకాలూ ఆయనకు అందినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత మూడేళ్లలో మైక్రోసాఫ్ట్ సంస్థ షేర్ల విలువ రెట్టింపు కావడంతో కంపెనీ స్థిరత మరింత బలపడింది. సత్యనాదెళ్ల తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు సంస్థను అంతర్జాతీయంగా నూతన స్థాయికి చేర్చాయి. ఈ విజయాలే ఆయనకు అత్యధిక పారితోషికం అందడానికి ప్రధాన కారణంగా నిలిచాయి.

# పండుగ సీజన్‌లో టాటా మోటర్స్ చరిత్ర సృష్టి




మనగళం : నవరాత్రి నుండి దీపావళి వరకు ఉన్న ముప్పై రోజుల పండుగ కాలంలో టాటా మోటర్స్ లక్ష యూనిట్లకు పైగా వాహనాలను విక్రయించి తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇది గత ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే ముప్పై మూడు శాతం అధికమని సంస్థ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాహనాల ధరలపై సానుకూల ప్రభావం చూపింది. టాటా మోటర్స్ సహా పలు కంపెనీలు తమ ధరలను తగ్గించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. పండుగ సీజన్ కూడా అమ్మకాల పెరుగుదలకు తోడ్పడింది. ఈ విక్రయ విజయంలో అత్యధిక భాగం ఎస్‌యూవీ వాహనాలదేనని కంపెనీ పేర్కొంది. నెక్సాన్ మోడళ్లను మాత్రమే మూడు లక్షల ఎనిమిది వేల యూనిట్ల వరకు అమ్మినట్టు సమాచారం. అలాగే పంచ్ మోడళ్ల అమ్మకాలు రెండు లక్షల ముప్పై రెండు వేల యూనిట్లకు చేరుకున్నాయి. వినియోగదారుల అభిరుచిలో ఎస్‌యూవీలు మొదటి స్థానంలో నిలిచాయి.

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తిదారుల్లో ఒకటైన టాటా మోటర్స్ ఈ విభాగంలో కూడా మంచి వృద్ధిని సాధించింది. వాతావరణం మీద కలిగే ప్రభావం, ఆపరేటింగ్ ఖర్చుల తగ్గుదల వంటి అంశాలు వినియోగదారులను ఈ దిశగా ఆకర్షిస్తున్నాయి. టాటా ఎలక్ట్రిక్ కార్లపై ఉన్న విశ్వాసం విక్రయాలను గణనీయంగా పెంచినదిగా తెలుస్తోంది. టాటా ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో అయిన శైలేష్ చంద్ర ఈ విజయానికి ప్రధాన శక్తిగా నిలిచారు. మార్కెట్ అవసరాలను ముందుగానే గ్రహించి, అనుగుణంగా వ్యూహాలు అమలు చేయడం విక్రయాలలో ఊపునిచ్చింది. ఎస్‌యూవీలపై దృష్టిపెట్టడమూ, ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ కూడా ఈ వృద్ధికి తోడ్పడింది.

# టాలీవుడ్‌కి రీఎంట్రీ ఇస్తున్న పూజా హెగ్డే





మన గళం, సినిమా : టాలీవుడ్‌లో ఒకప్పుడు గోల్డెన్ లెగ్ అని పేరు తెచ్చుకున్న అందాల తార పూజా హెగ్డే, కొద్ది గ్యాప్ తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలోకి మళ్లీ బిజీ అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల హిందీ, తమిళ సినిమాలపై దృష్టి పెట్టిన పూజా, ఇప్పుడు తెలుగులో వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ముఖ్యంగా, నేచురల్ స్టార్ నాని సరసన ఒక సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్టు తాజా సమాచారం. ప్రముఖ దర్శకుడు సుజిత్ (సాహో ఫేమ్) డైరెక్షన్‌లో నాని చేయబోయే తదుపరి చిత్రంలో పూజా హెగ్డేను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ కాంబినేషన్ కనుక సెట్ అయితే, నాని-పూజా హెగ్డే జంటగా నటించబోయే మొదటి సినిమా ఇదే అవుతుంది. ఈ వార్త ఫ్యాన్స్‌లో భారీ అంచనాలను పెంచుతోంది. ఇది మాత్రమే కాక, పూజా హెగ్డే యంగ్ హీరో దుల్కర్ సల్మాన్ పక్కన కూడా ఒక లవ్ స్టోరీలో నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించబడింది. రవి నెలకుడితి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్రం ద్వారా పూజా హెగ్డే తెలుగులో ఒక గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తన కొత్త సినిమాలతో పాటు, పూజా హెగ్డే ఫిట్‌నెస్, ఫ్యాషన్ అంశాలలో ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులకు టచ్‌లో ఉంటున్నారు. వరుస ఫ్లాప్‌ల తర్వాత తమిళంలో విజయ్ సినిమా ‘జన నాయగన్’ మరియు ఇతర హిందీ ప్రాజెక్టులతో మళ్లీ ఫామ్‌లోకి వస్తున్న పూజా, తెలుగులో కూడా పూర్వ వైభవాన్ని దక్కించుకుంటారా లేదా అనేది చూడాలి.



# డొనాల్డ్ ట్రంప్ వీడియోపై సంచలనం

మన గళం, సినిమా : ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాజీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పోస్ట్ చేసిన ఒక వీడియోపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో కంటెంట్‌ను చూసిన తర్వాత తాను అమెరికా పట్ల గౌరవాన్ని పూర్తిగా కోల్పోయినట్లు ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ట్రంప్ పోస్ట్ చేసిన ఆ కంటెంట్ “అత్యంత అసభ్యకరమైనది” మరియు లిలి”నీచమైనది”లిలిగా వర్మ అభివర్ణించారు. నిన్నటి వరకు తాను గౌరవించిన అమెరికా, ఆ వీడియో కారణంగా ఇప్పుడు లిలి”అత్యంత అసభ్యకరమైన, నీచమైన దేశం”లిలిగా అనిపిస్తోందని ఆయన తీవ్రంగా స్పందించారు.

సాధారణంగానే తన వివాదాస్పద అభిప్రాయాలతో ఎప్పుడూ వార్తల్లో ఉండే %=+ఎ%, ఈసారి అమెరికా రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కంటెంట్ ఎంతగా ఆయనను కలచివేసిందంటే, దానిపై అమెరికన్ల స్పందన ఎలా ఉండాలో కూడా ఆయన సూచించారు. డొనాల్డ్ ట్రంప్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని అమెరికన్లు నిరూపించుకోవాలంటే, వెంటనే ఒక పని చేయాలని ఆయన కోరారు. ఆ పని ఏమిటంటే, ట్రంప్ పోస్ట్ చేసిన దానికంటే “మరింత అసభ్యకరమైన వీడియోలతో” వైట్‌హౌస్‌ను నింపేయాలని సూచించారు. కేవలం విమర్శించడం కాకుండా, అమెరికన్ల నిరసనను ట్రంప్‌కు అదే స్థాయిలో, మరింత తీవ్రంగా తెలియజేయడానికి ఈ మార్గాన్ని ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా మాత్రమే అమెరికన్లు ఆ అసభ్యతతో తాము ఏకీభవించడం లేదని నిరూపించుకోగలరని వర్మ ఉద్దేశం. చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో త్వరగా వైరల్ అయింది. ఒక సినీ దర్శకుడు, అమెరికా మాజీ అధ్యక్షుడు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇంత తీవ్రంగా ఖండించడం, ఆ దేశంపైనే ఘాటు వ్యాఖ్యలు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో భిన్నమైన అంశాలపై కూడా తన అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేస్తారనే విషయాన్ని మరోసారి నిరూపించాయి.

# గ్లామర్‌తో పాటు ఫిట్‌నెస్ రహస్యాలు!

మన గళం, సినిమా : టాలీవుడ్‌లో తన చలాకీ నటన, అందంతో అసంఖ్యాకమైన అభిమానులను సంపాదించుకున్న హీరోయిన్ రాశి ఖన్నా. ‘ఊహలు గుసగుసలాడే’ సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైన ఈ ఢిల్లీ బ్యూటీ... కేవలం తెరపైనే కాదు, సోషల్ మీడియాలోనూ తన గ్లామర్ ఫోటోషూట్స్‌తో యువతను ఆకట్టుకుంటూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా, రాశి ఖన్నా సోషల్ మీడియాలో షేర్ చేసిన గోల్డెన్ కలర్ శారీ లుక్ మరియు మోడ్రన్ డ్రెస్సులలోని ఫోటోలు విపరీతంగా వైరల్ అయ్యాయి. తన స్టైలిష్ ఎంపికలు, ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తూ, ఫ్యాషన్ ఐకాన్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అరుదుగా గ్లామర్ డోస్ పెంచినా, అది అభిమానుల దృష్టిని మళ్లించకుండా ఉండదు. తెరపై రాశి ఖన్నా అంత అందంగా, ఫిట్‌గా కనిపించడానికి ఆమె సౌందర్య చిట్కాలు మరియు ఫిట్‌నెస్ దినచర్య ఎంతో సహాయపడుతున్నాయి. మొటిమల వంటి సమస్యలకు ఎక్కువగా సహజమైన ఇంటి చిట్కాలనే పాటిస్తానని, ముఖ్యంగా బొప్పాయి గుజ్జును ఉపయోగిస్తానని గతంలో రాశి వెల్లడించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడమే తన అందం, కాంతివంతమైన చర్మానికి అసలు రహస్యం అని ఆమె చెబుతారు. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, హిందీలో కూడా వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ కెరీర్‌లో బిజీగా ఉన్న రాశి, తన అందం, అభినయంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తూనే ఉన్నారు.



# నేచురల్ స్టార్ నాని కెరీర్ పీక్ స్టేజ్



మన గళం, సినిమా : నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం తెలుగు సినిమాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ తన మార్కెట్‌ను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ‘దసరా’ వంటి భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని చేస్తున్న ప్రతిష్టాత్మక పాన్-వరల్డ్ చిత్రం ‘ది ప్యారడైజ్’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. 1980ల నాటి నేపథ్యంలో, అణగారిన వర్గాల పోరాటం ఇతివృత్తంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం, నాని కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్టుగా నిలుస్తోంది. మార్చి 26, 2026న విడుదల కానున్న ఈ సినిమా కోసం ఏకంగా ?150 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు సమాచారం. ఈ సినిమాకు రగ్గడ్ లుక్‌లో ఉన్న నాని పాత్ర పేరు ‘జడల్’. ఈ సినిమాను తెలుగు, హిందీతో సహా ఏకంగా ఎనిమిది భాషల్లో (ఇంగ్లీష్, స్పానిష్‌తో కలిపి) విడుదల చేయాలనే ప్రణాళికతో మేకర్స్ ఉన్నారు. ‘ది ప్యారడైజ్’ సినిమాపై అంచనాలు భారీగా పెరగడానికి మరో కారణం దానిలో నటిస్తున్న పవర్ఫుల్ క్యాస్టింగ్. ముఖ్యంగా, ‘పుష్ప’తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే, ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు, డ్యాన్సర్ రాఘవ్ జుయాల్ విలన్‌గా నటిస్తున్నారు. ఇది రాఘవ్‌కు తెలుగులో తొలి చిత్రం. తన పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అవుతున్నట్లు రాఘవ్ ప్రకటించడంతో, నాని-రాఘవ్ మధ్య పోరాట సన్నివేశాలు ఉత్కంఠగా ఉండనున్నాయి. అంతేకాక, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని సమాచారం. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది.

నాని తదుపరి సినిమా కూడా సినీ వర్గాల్లో భారీ చర్చనీయాంశమైంది. పవన్ కళ్యాణ్ చిత్రంతో దేశవ్యాప్త విజయాన్ని అందుకున్న దర్శకుడు సుజీత్‌తో నాని కొత్త ప్రాజెక్ట్ ఇటీవల దసరా సందర్భంగా లాంఛనంగా ప్రారంభమైంది. దీనికి సంబంధించిన పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు వర్కింగ్ టైటిల్‌గా ‘బ్లడీ రోమియో’ అనే పేరు ప్రచారంలో ఉంది. ఈ క్రేజీ కాంబోలో నానికి జోడీగా స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. వెంకటేష్ దగ్గుబాటి ముఖ్య అతిథిగా హాజరైన ఈ ప్రారంభోత్సవం తర్వాత, ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ దీపావళి తర్వాత మొదలుకానుందని మేకర్స్ ప్రకటించారు. 2026 చివర్లో ఈ సినిమా విడుదల అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు.

మరోవైపు, నాని నిర్మాతగా వ్యవహరిస్తూ హీరోగా నటిస్తున్న సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ‘%ఎ×ు%: ది థర్డ్ కేస్’ గురించి కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు శైలేష్ కొలను రూపొందిస్తున్న ఈ చిత్రంలో నాని ‘అర్జున్ సర్కార్’ అనే పోలీస్ అధికారి పాత్రలో నటిస్తున్నారు. ఈ సిరీస్‌లోని మునుపటి భాగం బాక్సాఫీస్ వద్ద ?100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టడంతో, నానితో కూడిన ఈ మూడో భాగంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా 2025లోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నాని ఈ సిరీస్‌కు హీరోగానే కాక, నిర్మాతగా కూడా వ్యవహరించడం విశేషం. మొత్తం మీద, నాని ప్రస్తుతం ఒకేసారి మూడు వైవిధ్యభరితమైన ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఒకవైపు సామాజిక అంశాలతో కూడిన భారీ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ ‘ది ప్యారడైజ్’ షూటింగ్‌లో రగ్గడ్ లుక్‌లో ఉండగా, మరోవైపు సుజీత్ దర్శకత్వంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమవుతున్నారు. ఇంకోవైపు, ‘%ఎ×ు% 3’ వంటి క్రైమ్ థ్రిల్లర్‌తో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేయనున్నారు. వైవిధ్యమైన పాత్రలు, భారీ ప్రాజెక్టులతో నాని కెరీర్ అత్యంత పీక్ స్టేజ్‌లో ఉందని, ఆయన రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సవాళ్లు స్వీకరించడం నాకిష్టం





మన గళం, సినిమా : ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు తాజాగా ఒక సదస్సులో పాల్గొని, తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా, ‘పుష్ప: ది రైజ్’ చిత్రంలో ఆమె చేసిన ఐకానిక్ స్పెషల్ సాంగ్ ‘ఊ అంటావా మావా’ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

– సమంత ఏమన్నారంటే?

‘ఊ అంటావా మావా’ పాటలో నటించడానికి గల కారణాన్ని సమంత ఈ సందర్భంగా వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ, “నేను ఎప్పుడూ నన్ను సెక్సీగా అనుకోలేదు. నిజాయితీగా చెప్పాలంటే, అప్పటివరకు నాకు ఎవరూ అలాంటి ‘బోల్డ్ రోల్స్’ లేదా అలాంటి అవకాశాలు ఇవ్వలేదు. నేను నన్ను నేను పరీక్షించుకోవాలనుకున్నాను. నేను సెక్సీగా చేయగలనేమో అని తెలుసుకోవడానికి నాకిదొక సవాలుగా తీసుకున్నాను. అందుకే, అది నా సామర్థ్యాన్ని పరీక్షించుకోవడానికి చేసిన ఒక వన్-టైమ్ ఎక్స్‌పెరిమెంట్,” అని స్పష్టం చేశారు. సమంత తన వృత్తిపరమైన నిర్ణయాల గురించి కూడా మాట్లాడారు. ‘ది ఫ్యామిలీ మ్యాన్ 2’ వెబ్ సిరీస్‌లో ఆమె పోషించిన రాజీ పాత్ర గురించి మాట్లాడుతూ, తాను చేయని పాత్రలు, కొత్తదనాన్ని ఇచ్చే పాత్రలనే తాను వెతుక్కున్నానని తెలిపారు. ఆ పాత్ర పూర్తి భిన్నంగా ఉండడం వల్లే తాను అటు వైపు వెళ్ళానని, తన ప్రొఫెషనల్ లైఫ్‌కు కొత్త మెరుగులు దిద్దేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తానని ఆమె పేర్కొన్నారు. 2021లో విడుదలైన ‘ఊ అంటావా మావా’ పాట దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పాట విడుదలైనప్పుడు, సమంతను కొందరు విమర్శించినప్పటికీ, ఆమె నటన, గ్లామర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పుడు, దాదాపు రెండేళ్ల తర్వాత, ఆ పాట వెనుక ఉన్న తన వ్యక్తిగత కారణాన్ని, ఆ సవాలును స్వీకరించడానికి గల ధైర్యాన్ని సమంత వెల్లడించడం సినీ అభిమానులకు కొత్త విషయాన్ని అందించింది. ప్రస్తుతం సమంత, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన వెబ్ సిరీస్ ‘సిటాడెల్: హనీ బన్నీ’ విడుదలకు సిద్ధంగా ఉంది, అలాగే ‘రాక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్’ అనే మరో వెబ్ సిరీస్‌లో, తెలుగు చిత్రం లిలి’మా ఇంటి బంగారం’లిలిలో కూడా నటిస్తూ బిజీగా ఉన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# వరల్డ్ కప్ స్టార్ నడినే డీక్లెర్క్



మన గళం, మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జట్టు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోంది. అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులకు వరుసగా చెక్ పెడుతూ, మొట్టమొదటి ఐసీసీ ట్రోఫీని గెలుచుకునే దిశగా ఈ సఫారీ జట్టు దూసుకుపోతోంది. ముఖ్యంగా, జట్టు ఒత్తిడిలో ఉన్న ప్రతిసారీ కొండంత బలంగా నిలబడుతున్నది ఒక్క ఆల్‌రౌండర్ మాత్రమే. ఆమే నడినే డీక్లెర్క్. విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగుతూ, అలవోకగా సిక్సర్లు బాదేస్తూ, ఒంటిచేత్తో జట్టుకు భారీ స్కోర్లు అందిస్తున్న ఈ ఫినిషర్, ప్రస్తుతం దక్షిణాఫ్రికాకు ట్రంప్ కార్డ్‌గా మారింది. టీనేజ్ వయసులో ఈ యంగ్‌స్టర్ హాకీ మరియు జావెలిన్ త్రో వంటి క్రీడల్లో అద్భుతంగా రాణించింది. ఒకప్పుడు మైదానంలో స్టిక్‌తో మెరుపు వేగాన్ని, చేతిలో జావెలిన్‌తో దూకుడును ప్రదర్శించిన డీక్లెర్క్, ఇప్పుడు క్రికెట్ బ్యాట్‌తో లిలి'వండర్ గర్ల్'లిలిగా నిరూపించుకుంటోంది. 2017లో భారత జట్టుపైనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన డీక్లెర్క్ ప్రధాన బలం ఆమె పవర్ హిట్టింగ్. అలవోకగా సిక్సర్లు కొట్టడం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా పరుగులు రాబట్టడం ఈ యువ క్రికెటర్ ప్రత్యేకత. జాతీయ జట్టుకు ఎంపికవ్వడమే గొప్ప అనుకుంటే, అంతర్జాతీయ వేదికల్లో దేశానికి గెలుపు అందించడం మహోన్నతమైన విషయం. ప్రస్తుతం ప్రపంచ కప్‌లో నడినే డీక్లెర్క్ తమ దేశ ప్రజలు గర్వపడేలా ఆడుతోంది. భారత్‌పై మెరుపు అర్ధ సెంచరీతో మొదలైన ఆమె పరుగుల ప్రవాహం, పాకిస్థాన్‌పై సుడిగాలి ఇన్నింగ్స్ వరకూ నిరాటంకంగా కొనసాగుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మూడేళ్ల తర్వాత టీ20 వరల్డ్ కప్‌లో కూడా అద్భుతంగా రాణించిన తను, 2023లో పాకిస్థాన్‌పై జరిగిన సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకుంది.

బిగ్‌బాష్ లీగ్, ది హండ్రెడ్, డబ్ల్యూపీఎల్ వంటి ప్రపంచవ్యాప్త ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ దుమ్మురేపుతున్న డీక్లెర్క్, పదమూడో సీజన్ మహిళల వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికాకు అత్యంత కీలకమైన ఆటగాడిగా మారింది. క్లిష్ట సమయాల్లో జట్టును విజయతీరాలకు చేర్చే ఆమె సామర్థ్యం, దక్షిణాఫ్రికాకు తొలి ఐసీసీ టైటిల్‌ను అందించే ప్రయత్నంలో కీలకమవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# పాకిస్థాన్ కెప్టెన్ షేక్‌హ్యాండ్ తిరస్కరణ

మన గళం, ఏషియన్ యూత్ గేమ్స్ 2025లో భారత కబడ్డీ యువజట్టు తన ఆధిపత్యాన్ని అద్భుతంగా చాటింది. బహ్రెయిన్‌లో జరుగుతున్న 3వ ఏషియన్ యూత్ గేమ్స్‌లో దాయాది దేశం పాకిస్థాన్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 81-26 అనే భారీ తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేసి, టోర్నమెంట్‌లో వరుసగా మూడో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో భారత యువ కబడ్డీ జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్‌లో అక్టోబర్ 23న భారత్ ఇరాన్‌తో తలపడే అవకాశం ఉంది.

– అంపైర్ ముందే.. కరచాలనం తిరస్కరణ!

మైదానంలో ఘన విజయం ఒకవైపు ఉంటే, మ్యాచ్‌కు ముందు జరిగిన ఒక సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు, టాస్ సమయంలో ఇరు జట్ల కెప్టెన్‌లు, అంపైర్‌తో కలిసి ఉన్నారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్ కెప్టెన్ క్రీడా స్ఫూర్తితో కరచాలనం (హ్యాండ్‌షేక్) ఇవ్వడానికి తన చేతిని ముందుకు చాచాడు. దీనికి ప్రతిస్పందనగా, భారత %ఖ%-18 కబడ్డీ జట్టు కెప్టెన్ ఇషాంత్ రథీ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. ఇషాంత్ రథీ పాక్ కెప్టెన్ కరచాలనాన్ని సున్నితంగా తిరస్కరించాడు. అతని ముఖంలో ఎటువంటి భావం లేకుండా నిర్లిప్తత కనిపించడంతో, పాకిస్థాన్ కెప్టెన్ వెంటనే తన చేతిని వెనక్కి తీసుకున్నాడు. ఈ సంఘటన అక్కడే ఉన్న అంపైర్ మరియు ఇరుజట్ల సభ్యుల దృష్టిని ఆకర్షించింది.

– నిశ్శబ్ద నిరసనగా 'నో-హ్యాండ్‌షేక్'



ఇటీవలి కాలంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడారంగంలో 'నో-హ్యాండ్‌షేక్' విధానం పెరుగుతోంది. ఈ సంఘటన దాన్ని మరోసారి ధృవీకరించింది. ఇది కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని, రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను ప్రతిబింబించే ఒక నిశ్శబ్ద నిరసనగా క్రీడాభిమానులు ఈ చర్యను భావిస్తున్నారు. మ్యాచ్‌లో ఘన విజయంతో పాటు, కెప్టెన్ ఇషాంత్ రథీ తీసుకున్న ఈ నిర్ణయం కూడా దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలలో చర్చనీయాంశంగా మారింది.

# ఒకే ఒక బెర్తు కోసం భారత్, న్యూజిలాండ్, శ్రీలంక పోరాటం!



మన గళం, భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న మహిళల వన్డే ప్రపంచకప్‌లో సెమీ-ఫైనల్స్ రేసు చివరి అంకానికి చేరుకుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్లు ఇప్పటికే నాకౌట్ దశలో తమ స్థానాలను ఖాయం చేసుకోగా, మిగిలిన ఒకే ఒక బెర్తు ఎవరికి దక్కుతుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఈ కీలక స్థానం కోసం మూడు జట్లు భారత్, న్యూజిలాండ్, శ్రీలంక్న పోరాడుతున్నాయి. లీగ్ దశలో మరో ఆరు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, ఈ మూడు జట్ల సెమీస్ అవకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం.

– హర్మన్‌ప్రీత్ సేనకు క్లిష్టమైన పరిస్థితి

టోర్నీ ఆరంభంలో రెండు విజయాలు సాధించినప్పటికీ, ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌లలో గెలుపు అంచుల దాకా వచ్చి ఓటమి పాలైన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు సెమీస్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలో రెండు గెలిచి, నాలుగు పాయింట్లతో (నెట్ రన్ రేట్ 0.526) టీమ్‌ఇండియా ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. భారత్ సెమీస్ చేరుకోవాలంటే ఉన్న మార్గాలు భారత జట్టుకు ముందున్న రెండు మ్యాచ్‌లు (న్యూజిలాండ్‌తో మరియు బంగ్లాదేశ్‌తో) అత్యంత కీలకం. ఈ రెండూ గెలిస్తే, ఇతర జట్ల గెలుపోటములతో లేదా నెట్ రన్ రేట్‌తో సంబంధం లేకుండా, భారత్ మొత్తం ఎనిమిది పాయింట్లతో సులభంగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ భారత్ కివీస్‌తో జరిగే కీలక మ్యాచ్‌లో ఓడిపోయినా, నాకౌట్ దశకు చేరే అవకాశాలు ఇంకా ఉన్నాయి. అప్పుడు న్యూజిలాండ్ తమ ఆఖరి మ్యాచ్‌లో (ఇంగ్లండ్‌తో) ఓడిపోవాలి. అదే సమయంలో, ఉమెన్ ఇన్ బ్లూ తమ తదుపరి మ్యాచ్ అయిన బంగ్లాదేశ్‌తో పోరులో భారీ తేడాతో గెలవాలి. ఈ సమీకరణాలన్నీ సరిగ్గా కుదిరితే మెరుగైన నెట్ రన్ రేట్ ఆధారంగా భారత్ సెమీస్‌కు చేరుతుంది.

వర్షం వల్ల సమీకరణాలు మారితే.. ఒకవేళ కౌర్ సేన ఆడబోయే రెండు మ్యాచ్‌లు కూడా వర్షం కారణంగా రద్దై, పాయింట్లను పంచుకోవాల్సి వస్తే, సమీకరణాలు మరింత క్లిష్టంగా మారతాయి. అప్పుడు ఇంగ్లండ్ తప్పనిసరిగా న్యూజిలాండ్‌ను ఓడిరచాల్సి ఉంటుంది. మరోవైపు, శ్రీలంక జట్టు గనక తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడిస్తే వారికి ఆరు పాయింట్లు చేరతాయి. అటువంటి స్థితిలో, నెట్ రన్ రేటే సెమీస్ బెర్త్‌ను నిర్ణయించే ప్రధాన అంశంగా మారుతుంది.

# స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా భారత్



మన గళం, భారతదేశానికి క్రీడారంగంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ప్రతిష్టాత్మక శతాబ్ది కామన్వెల్త్ క్రీడలు 2030వ సంవత్సరంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరగడానికి రంగం సిద్ధమైంది. 2010లో ఢల్లీలో నిర్వహించిన తర్వాత, దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఈ అంతర్జాతీయ క్రీడా సంబరాన్ని భారత్ మరోసారి నిర్వహించడం దేశ క్రీడా భవిష్యత్తుకు ఒక ముఖ్యమైన ముందడుగుగా పరిగణించబడుతోంది. 2030 కామన్వెల్త్ క్రీడలు కేవలం ఒక క్రీడా ఈవెంట్ మాత్రమే కాదు. ప్రపంచ క్రీడా పటంలో భారతదేశాన్ని ఒక నమ్మకమైన, శక్తివంతమైన లిలి'క్రీడా గమ్యస్థానం' గా మార్చేందుకు దక్కిన గొప్ప అవకాశం ఇది. క్రీడా పర్యాటకాన్ని పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఈ ఈవెంట్ ఒక కీలక వేదిక కానుంది.

– 2036 ఒలింపిక్స్‌కు బలమైన పునాది

ప్రస్తుతం ప్రపంచ క్రీడా వేదికపై భారత్‌కు ఈ భారీ అవకాశం దక్కడానికి ప్రధాన కారణం, దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం చూపుతున్న దృష్టి. ముఖ్యంగా, 2036లో జరిగే ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే భారతదేశ ఆశయానికి, 2030 కామన్వెల్త్ క్రీడలు ఒక కీలకమైన మెట్టుగా నిలవనున్నాయి. ఈ మెగా ఈవెంట్‌ను అత్యుత్తమ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించగలిగితే, భారత్ తన ప్రపంచ స్థాయి ఈవెంట్ నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపించుకున్నట్టే. 2010లో ఢల్లీలో కామన్వెల్త్ గేమ్స్ సందర్భంగా ఎదురైన సవాళ్లు, లోపాల నుంచి గుణపాఠం నేర్చుకొని, ఈసారి అత్యున్నత స్థాయి, పారదర్శకమైన నిర్వహణతో గేమ్స్‌ను ముందుకు తీసుకెళ్లడం అత్యవసరం. 2030 క్రీడల విజయవంతమైన నిర్వహణ, 2036 ఒలింపిక్స్ బిడ్‌కు బలమైన సాక్ష్యంగా, తిరుగులేని ఆధారంగా నిలిచి, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీవిశ్వాసాన్ని చూరగొనే అవకాశం ఉంది. మొత్తంగా, 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం కేవలం ఒక క్రీడా పోటీ కాదు. అది భారతదేశ క్రీడా మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయికి పెంచేందుకు, దేశ క్రీడా సంస్కృతిని మార్చేందుకు, మరియు ప్రపంచ క్రీడా పటంలో ఒక శక్తివంతమైన, నమ్మకమైన క్రీడా గమ్యస్థానంగా నిలబడేందుకు దక్కిన అద్భుతమైన చారిత్రక అవకాశం.

# క్రికెట్ చరిత్రలో తొలిసారి

మన గళం, సాధారణంగా పిచ్ స్పిన్నర్లకు ఎంతగా సహకరించినా, వన్డే క్రికెట్‌లో ఇన్నింగ్స్ ఆరంభంలో ఒకటి లేదా రెండు ఓవర్లైనా పేసర్లకు ఇవ్వడం ఆనవాయితీ. కానీ, బంగ్లాదేశ్, వెస్టిండీస్ జట్ల మధ్య మంగళవారం ఢాకాలో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో కరీబియన్ జట్టు ఈ ఆనవాయితీని బద్దలు కొట్టి, క్రికెట్ చరిత్రలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. వెస్టిండీస్ జట్టు ఈ మ్యాచ్‌లో ఏకంగా 50 ఓవర్లనూ స్పిన్నర్లతోనే వేయించి సంచలనం సృష్టించింది. వన్డే క్రికెట్ ఫార్మాట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో మొత్తం 50 ఓవర్ల కోటాను కేవలం స్పిన్నర్లే వేయడం ఇదే మొదటిసారి. ఢాకాలోని షేర్ ఏ బంగ్లా నేషనల్ స్టేడియం ఈ చారిత్రక రికార్డుకు వేదికైంది.

– ఆల్రౌండ్ స్పిన్ దాడి

మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా బంగ్లాతో జరిగిన ఈ రెండో వన్డేలో, ముందుగా ఫీల్డింగ్ చేసిన కరీబియన్ జట్టు.. రెండు వైపుల నుంచీ స్పిన్ దాడిని కొనసాగించింది. జట్టులోని అకీల్ హొసెన్, రోస్టన్ చేజ్, పియారె, మోతీ, అథనెజ్ వంటి స్పిన్నర్లందరూ కలిసి, తలా 10 ఓవర్ల చొప్పున మొత్తం 50 ఓవర్ల కోటాను పూర్తిచేశారు. పలుగులు తేలి ఉన్న (స్పిన్‌కు అనుకూలమైన) పిచ్‌పై విండీస్ స్పిన్నర్లు అద్భుతంగా రాణించి, ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. గతంలో, 1996లో శ్రీలంక జట్టు ఇదే వెస్టిండీస్‌పై ఆడిన ఒక మ్యాచ్‌లో 44 ఓవర్లను స్పిన్నర్లతో వేయించడమే ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఉన్న అత్యధిక రికార్డు. ఇప్పుడు విండీస్ ఆ రికార్డును అధిగమించి, సరికొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. ఈ చారిత్రక రికార్డుతో పాటు, మ్యాచ్ కూడా ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. ఇరుజట్లూ నిర్ణీత 50 ఓవర్లలో 213 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. దీంతో ఫలితాన్ని తేల్చేందుకు సూపర్ ఓవర్ నిర్వహించాల్సి వచ్చింది. సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ 10/1 స్కోరు చేయగా, బంగ్లాదేశ్ 9/1 వద్దే ఆగిపోయి ఓటమి పాలైంది. ఈ థ్రిల్లింగ్ విక్టరీతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను విండీస్ 1-1తో సమం చేసింది.



# అగార్కర్, గంభీర్‌ల వ్యూహాత్మక నిర్ణయం

మన గళం, దేశవాళీ క్రికెట్‌లో పరుగుల సునామీ సృష్టిస్తూ, నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్కు జాతీయ జట్టులో స్థానం దక్కకపోవడంపై మరోసారి తీవ్ర వివాదం చెలరేగింది. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మరియు టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ల నేతృత్వంలో ఉన్న సెలక్షన్ కమిటీ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగానే సర్ఫరాజ్ బలి అవుతున్నాడనే విమర్శలు క్రీడా వర్గాల నుంచి, అభిమానుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

– నిలకడైన ప్రదర్శనకు నిరాదరణ

సర్ఫరాజ్ ఖాన్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 65కు పైగా అద్భుతమైన బ్యాటింగ్ సగటును కొనసాగిస్తున్నాడు. అయినప్పటికీ, అంతర్జాతీయ టెస్ట్ జట్టులోకి లేదా కీలకమైన 'ఇండియా-ఏ' టూర్లలోకి కూడా అతడిని స్థిరంగా ఎంపిక చేయకపోవడం అన్యాయమని మాజీ క్రికెటర్లు విమర్శిస్తున్నారు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుని, 10 కిలోలకు పైగా బరువు తగ్గినా, అన్ని ఫిట్‌నెస్ పరీక్షలు పాస్ అయినా సెలక్టర్లు అతడిని విస్మరించారు. గంభీర్ సారథ్యంలో ఇబ్బందులు భారత జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశాలు మరింత దూరమయ్యాయి. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలోనూ గంభీర్ సర్ఫరాజ్‌కు బదులుగా వాషింగ్టన్ సుందర్‌కు ప్రాధాన్యత ఇచ్చారని వార్తలు వచ్చాయి. సర్ఫరాజ్‌ను పక్కన పెట్టడం వెనుక గంభీర్‌కు వ్యక్తిగత కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు కూడా సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి.

స్థానం మార్పుపై ఒత్తిడి సర్ఫరాజ్ సాధారణంగా దేశవాళీ క్రికెట్‌లో దిగువ మధ్య వరుసలో బ్యాటింగ్ చేస్తాడు. అయితే, జట్టులో స్థానం దక్కాలంటే అతను నెం. 3 స్థానంలో బ్యాటింగ్ చేయాలని సెలక్టర్లు చెప్పడం కూడా ఒక వివాదాంశంగా మారింది. దేశవాళీలో అద్భుతంగా రాణిస్తున్న ఆటగాడిని, అతడు ఆడే స్థానాన్ని మార్చుకోమని ఒత్తిడి చేయడం కేవలం అతడిని జట్టు నుంచి తప్పించేందుకు వేసిన వ్యూహాత్మక అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. సెలక్టర్ల వివరణపై అసంతృప్తి సర్ఫరాజ్ ఎంపిక జరగకపోవడంపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ గతంలో 'అవకాశాలు కోల్పోవడం సహజమే' అని ఇచ్చిన వివరణ కూడా అభిమానులను సంతృప్తిపరచలేకపోయింది. అద్భుతమైన ఫామ్‌లో ఉండి, టీమ్‌ఇండియా రిజర్వ్ బెంచ్‌లో ఉండాల్సిన ఒక యువ ప్రతిభావంతుడిని పదేపదే పక్కనపెట్టడంపై బీసీసీఐ విధానాలపై విమర్శలు మరింత పెరుగుతున్నాయి. మొత్తంగా, అద్భుతమైన దేశవాళీ రికార్డు ఉన్నప్పటికీ, గంభీర్-అగార్కర్ల వ్యూహాత్మక ప్రణాళికల కారణంగా సర్ఫరాజ్ ఖాన్ తన కెరీర్‌లో కష్టతరమైన దశను ఎదుర్కొంటున్నాడనే అభిప్రాయం బలంగా ఉంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310